అధికారులు వెంటనేవచ్చి తనిఖీచేసి, సమస్తం నశించినా ఈ లైట్నింగు కండక్టరు పడిపోదంటూ దాని నలావుంచి మరి మిగతా బిల్డింగును మాత్రం పునః కట్టారు. సాహెబును కాపలా వేశారు కొత్తకీ పాతకీ కూడా!

కాని చెట్లు ఆ చుట్టుపట్ల లేమనో ఏమో చిలుకలు మరి రాలేదు. సాహేబు వాటినిగురించి ఎంతచింతించినా అవి మరి రాలేదు. మరి పడగొట్టబడే బిల్డింగూలేదు.

... ... ... ... ...

## జీవితం యొక్క పరమావధి?

జీవితం యొక్క పరమావధి, ఇంత వరకు ఈపెద్ద వయస్సు వచ్చినా బోధపడకుండావుంది. ఒక విధంగా ప్రతీవాడు పుట్టిన తరువాత ఏపనో ఒకపని చేస్తూనే వుంటాడు. వింటూనో పడుకుంటూనో నడుస్తూనో పడుతూనో ఏదోపని చేస్తూనేవుంటాడు. భగవద్గీతలో చెప్పినట్లు ఆఖరుకు ఊపిరైనా పీలుస్తూవుంటాడు. అంచేత ఈ భూమియొక్క లాగుడు శక్తికంటె హైడ్రోజన్ బాంబుయొక్క సర్వవినాశకరశక్తి కంటె మిన్నయైన సూత్రం ఈ కాలక్షేప సూత్రంలో ఇమిడియున్నదని నా తాత్పర్యము. అయితే కాలక్షేపం చేయడంలోనే కరువు, కడుపుకక్కుర్తి, కళావిజ్ఞానము, కర్మ కౌశలము, కష్టం, కనికరం కనిపిస్తూవుంటాయి అవి కంటూంటే సంతృప్తి, దరహాసం ఇవన్నీకూడా జనిస్తూవుంటాయి. ఇలా కాల క్షేపంగా గడియల్ని వెళ్ళబుచ్చడమేనా? ఇంతకంటె మహో న్నతమైన స్థితి ఈ ప్రాణికి వుందా? అని ఒకరోజున నా ఆలోచన పోయింది. అందులోనే నవ్వొవచ్చింది.

అసలు నవ్వు అనేది రావడానికి కారణం ఆలోచనే అని నా నమ్మకం; కాబట్టి ఆలోచనతో కూడిన ఈ వ్యాసాన్ని చదివి

పాఠకులంతా నవ్వుదురుకాక! ఇదీ నా ఆశయం ఇంతపాడుగు దానిని వ్రాయడంలో.

ఒకనాటి ఉదయమే ఇంకా లోకం మేల్కొనకుండానే నేను విజయవాడలో ఒక వీధంట నడవడం కలిగింది. అప్పు డనుకున్నాను. ఆ పట్నం అన్ని పట్నాల్లాంటి పట్నమేనని, వీధులనిండా చెత్తా చెదారం వుంటాయని, మరిన్నీ ఇల్లూ వాకిలీ లేనివాళ్లు ఎందరెందరో వుంటారని, వాళ్లు మృత్యువుకై ఎదురు చూస్తూ వున్నట్లు చలిచే వణుకుతూ అలా పడుకునో కూర్చునో వుంటారని. అయితే దగ్గరకువెళ్ళి చూచేసరికి వాళ్ళమధ్య ఒక అగ్నిహోత్రం ప్రజ్వరిల్లుతూ వాళ్ళ ఊపిరిని వేడిపరుస్తూ వాళ్లను నిద్రబుచ్చుతూ వున్నట్లు గోచరించింది. అరుగులేదు, పందిరిలేదు, పరుపుమాట అలావుంచండి; మంచంమాట అలా వుంచండిః అయితేనేం నిదిరిస్తూవున్నారు. వాళ్ళమధ్యను అగ్ని హోత్రం ప్రజ్వరిల్లుతూవుంది. ఆ అగ్నిహోత్రం యొక్క వేడికి వాళ్లు నిదురిస్తూవున్నట్లు తోచె? ఆ అరుబయట ఆ అగ్నిహోత్రమే వారికావాసమన్నట్లు పోయింది నా ఆలోచన.

మరి కొంచెందూరం వెళ్ళేలోగా ఒక కాఫీహోటల్ తెరవ బడి వుంది. అగ్నిహోత్రంమీద పాలు సలసల మరుగుతూ వున్నాయి. వేడివేడి ఇడ్డెనలు సాంబార్, పలువురు మేజాబల్లల మీద పెట్టుకుని తింటూవున్నారు. అది వారికావాసమన్నట్టు పోయింది నా ఆలోచన! అలాల్లానే మంగలి సెలూన్‌లు, చాకలి లాండ్రీలు, చిల్లరదుకాణాలు అన్నీ తెరువబడి వినోదం గొల్ప సాగాయి. ఎవనిమట్టుకు వాణ్ణే వింటూంటే ఎందుకు వారి జీవనం అనిపిస్తూవుండేది. ఏదో "హైయర్" ఉన్నట్టు. కాని మళ్ళీ ఆ అసామీ నేనూ బ్రతకడమే దుర్లభమనిపించింది. ఇలా అను కుంటూనే తాగేశాను 'కప్పు' కాఫీ, ఇలాగ్గానే చేయించుకొన్నాను గడ్డం, ఇలాగ్గానే కొనవలసినవేవో కొనేసాను. తుదకేమనిపించింది

అవాసమన్నది తనకుతప్ప యితరుల కందరికీ ఉండితీరాలి, ఆ అవాసంలోనే తనకు ఆతిథ్యం ఉండాలి అని అనిపించింది.

ఇలాంటి ఆలోచనతోనే అప్పొద్దు రైల్వేస్టేషన్కు వెళ్లాను. ఓ గంటకింకా కాని రైలురాదు. అందాకా టిక్కెట్టు చూసుకుంటూనో పదిమంది ప్రయాణీకుల్ని పలుకరిస్తూ వెయిటింగు రూములో కూర్చోవలసి వచ్చింది.

ఒక విధంగా ఆలోచిస్తే రైలుస్టేషన్లో విశ్రాంతి గానవచ్చుననే వెళ్ళాను కూడాను. ఆ గంటముందుగా గది కలకల్లాడుతూంది. ప్రయాణీకులు అంతా మగవాళ్ళే-ఆడవాళ్ళ భాగం వేరు-ఎవళ్ళమట్టుకు వాళ్లు నిదిరిస్తూనో, కలలు గంటూనో, పలవరిస్తూనో అంతా ఏమరుపాటుగా కుర్చీలమీద, సోఫాలమీద సొమ్మసిలినట్లు కూర్చునివున్నారు. "ఎలక్ట్రిక్" ఫానులు తిరుగుతూ వున్నాయి. స్నానాలగది చప్పుడవుతూంది. అంతా మిలమిలా గలగలాగ జనంవుంది. కాని మనిషికిమాత్రం ఆగదిలో నిశ్శబ్దం. కట్టెకు ఎంత కదలికలేదో మనిషికి ఆ గదిలో ఆ నిమిషమప్పుడు అంతచేటు చలనం లేదనిపించింది. కలలోగాని పలకరిస్తే పలకరించాలి ఒకర్నొకర్ని, ఇవతలకేమీ వినిపించడంలేదు. దొంగలెత్తుకుపోయినా తమసామాను అక్కడే వుందనుకొనేటంత నిదరలో పడివున్నారు ప్రయాణీకు లందరూను. వేళ మిట్ట మధ్యాహ్నము అప్పుడే దాటిన ఒంటిగంటవేళ అయితేం "దొంగలున్నారు జాగ్రత్త" అనే బోర్డు వున్నది. కాపలా కాసేవాడు వున్నాడు. కాని ఆ బోర్డులెంత ఉపయోగపడుతున్నాయో అంత ఉపయోగపడుతున్నాడు వాడూను.

ఇంతమందీ వుండికూడా ఇంత నిశ్శబ్దంగా వుందేం గది అంతా అని అనుకున్నాను. ఆ అనుకోవడం యతి్రంతత్ ఆలోచనతో అనుకున్నానేమో నాలో నాకే నవ్వువచ్చింది. ఏమంటారేమో పాఠకులు. ఏమీలేదు జ్ఞాపకంవచ్చి. ఏదో జ్ఞాపకంవచ్చి...

ఏమి జ్ఞాపకంవచ్చిందో ఇప్పటికీ అప్పటికీ ఎవరికీ చెప్పలేదు కాని ఆ విషయం తలచుకొన్నప్పుడల్లా నవ్వుతో కూడిన ఆలోచన పోతూవుంటుంది. చెప్పలేదు కాని ఆ విషయం తలచుకొన్నప్పుడల్లా నవ్వుతోకూడిన ఆలోచన పోతూవుంటుంది. చెప్పమంటారా ఈ కథలో ఆ గొడవనుగురించి ! చెప్పమనేటట్టున్నారు పాఠకులు !

ఆమె కెంతలేదన్నా ఓ ముఫ్ఫయి యేళ్ళుండవచ్చును. ఆమె కూతురు ఒక పదమూడేండ్లదైనా కావచ్చును. వాళ్లిద్దరూ ఎక్కింది ఒక మొదటతరగతి రైలుగాడీ. ఆమె సోదరుడు ఒక రైల్వే పెద్ద యుద్యోగి ఆమెతోకూడా ప్రయాణం చేస్తున్నాడు. రైల్వేయుద్యోగస్తులలో పెద్ద హోదాకలవాళ్ళయితే 'రిజర్వుడ్' బండిలోనే ప్రయాణం చేస్తారు కాని ఇతగాడు మదరాసునుంచి వస్తు, సమయానికి 'రిజర్వు' చేయించుకోవడం మరచో ఏదైనా ఎక్కేది మొదటితరగతిగదా అనో కూర్చున్నాడు అతగాడి సోదరీ మణితోను, ఆమెయొక్క ఆ చిన్నపిల్లతోను. మొదటితరగతి గాడీ కాబట్టి అతి నిశ్శబ్దంగానే జరిగిపోయింది. చాలాదూరం ఆముగ్గురి మధ్య ఒకళ్లూ లేవకుండా నిదరోతూ రాత్రి అంతా గడిపారు. మరి తెల్లారడం బెజవాడలోనే !

దిగడం అప్రాంతాన్నే కావచ్చు కూడాను. బెజవాడలో ఎక్కడలేని సందడీ. ఇదీ ఫస్టుక్లాసు అన్నా రిజర్వు అన్నా ఎక్కేసెయ్యడమే పదిమంది. అతగాడు అస్సలైన రైల్వేయుద్యోగి కాబట్టి చోటిచ్చాడు ఎక్కేవాళ్లందరికీ. అయితే యీ ప్రౌఢ యీ పిల్ల ? వీళ్ళు మాత్రం పరుపు పరుపూ వ్యాపించుకు మరెవ్వరికీ చోటులేదన్నట్టు ఒక చిన్నపెట్టె మధ్య పెట్టుకుని అందులోంచి ముత్యాల హారాలు, బంగారు పోచీలు, రవ్వల దుద్దులు, అవీ యివీ ఏడు వారాలు నగలు ఒకేరోజున పెట్టుకునేటట్టు ముస్తాబు కాజొచ్చారు. అలా వాళ్లు పెట్టుకుంటూంటే చూచేవారు వింతగా చూస్తున్నారు. చోటులేక కొందరు, చోటు పెట్టరా అని కొందరు...

అంతలోకే ఆదాకాపై 'బెర్తు' మీద నెవరికీ తెలియకుండా నిదరోతోవున్న ఒక అసామీ జాగ్రత్తగా అడుగుమోపే ఇనుప మెట్టుమీద తన శరీరభారమంతా నిలిపి అలా 'బూట్సు' కాళ్లతో దూకాడు ఈ ఇద్దరిమధ్యకూ ఆంజనేయుల్లాగు.

ఎక్కడ నుంచి వస్తున్నాడో ఏవూరు వెడుతున్నాడో ఎవ్వరికీ తెలియదు. అంతా పై 'బెర్తు' మీదనే తనపెట్టే, తన 'హోల్డాల్' తన టోపీ, తన యావత్తూ పై 'బెర్తు' మీదనే పెట్టుకుని, అదాకా పరున్నాడులాగుంది. ఈ స్టేషన్‌లో మెళకువ వచ్చింది లాగుంది లేచాడు. లేచి క్రిందకురికే సరికి అంతా క్రింద ఇరకాటంగా వుంది. కొంతమంది నిలుచున్నారు.

కొంతమంది కూర్చోడానికి సంకోచిస్తూ వున్నారు. వాళ్లందరి దగ్గరా తగు టిక్కెట్లున్నాయా లేదా అని అడిగినవారు లేరు. దూకినాయన మాత్రం దూకీ దూకడంలోనే తన పంట్లం జేబు లోంచి ఒక మొదటి తరగతి టిక్కెట్టుతీస్తూ తానెక్కడ పడితే అక్కడే కూర్చోవచ్చునన్నట్లు ఇటూ అటూ చూచాడు. రైలు నడుస్తూనేవుంది సుమండీ! ఏ మాటంటే అమాటే అదిధ్వని చేసేలా చప్పుడు చేసుకుంటూ పోతూవుంది సుమండి. మనం ఏమాటా అనకపోయినా రైలు నడుస్తూనేవుంది సుమండీ!

మీరిందాకట్నుంచీ పై 'బెర్తు' మీదున్నారని తెలియదు. దయచేయండి ఇలా! అని ఆహ్వానించాడు రైల్వేయుద్యోగి. కొత్త మనిషి అలా ఆ రైల్వేయుద్యోగి ప్రక్కన ఆశీనుడౌతూ, ఒక కాలుపారజాపి, పంట్లాంజేబులోంచి ఒక ఫోటోలకట్ట ఎక్క లాగాడు. రెండోజేబులోని తన మొదటి తరగతి టిక్కెట్టు యథా ప్రకారంకుక్కేశాడు. రైలు యథాప్రకారంగా మామూలు వేగాని కేమాత్రం తీసిపోకుండా హుటాహుటీ నడుస్తూనేవుంది.

నిలబడ్డవాళ్లు నించునేవున్నారు. "మీ మీఫోటోలుతీస్తాను" [illegible] టిక్కెట్టు పైకిచూపుతూ మీరంతా 'రెడీ' అనేసరికి

'పోజు' యిచ్చారా అంటే అన్నాడు. ఒకరిదగ్గరా ఫస్టుక్లాసు టిక్కెట్లు లేవుగదా ఏటిక్కట్లులేవు. ఇదేమిటనుకున్నారు! టిక్కెట్లు లేకుండా బండి ఎక్కడానికి ఏ తరగతి బండిపడితే ఆ తరగతిబండి ఎక్కడానికి? అని పెద్ద తగవుచేశాడు. వారు ఆ నించున్నవారు మారుమాట మాట్లాడలేక వచ్చిన ఆ స్టేషనులో కొందరు; పైస్టేషనులో కొందరూ దిగిపోయారు.

ఈ 'బెర్తు' మీద కూర్చుని వస్తువులు, పువ్వులు అవీ పెట్టు కుంటూన్న ఆడవాళ్ళిద్దరూ మాత్రం అప్రయత్నంగా తమ తమ ఫస్టుక్లాసు టిక్కెట్లు పైకితీశారు. 'దట్సరై' టంటూ వాళ్ళిద్దర్నీ ఫొటోలోకి దింపాడు. రైల్వేయుద్యోగి వెంటనే "ఫొటో కెమీరా" వున్న ఎదుట వానిగుత్తి పట్టుకొని "ఇదా నీపనీ, నీయుద్యోగం" అని అడిగాడు. వెంటనే కఱుగూ బెఱుగూ లేకుండా "ఆమె నా సోదరి, అమె కుమార్తె ఆమె నీకేమౌతారో కానీ" అన్నాడు పోలికనుబట్టి రైల్వేయుద్యోగి చకితుడై. ఆ కెమీరా అలా వదలి, ఎలావచ్చాయి వారిఫొటోలు? ఆమె నా సోదది, ఆమె కుమార్తె ఆమె" అని అన్నాడు.

"అలా టిక్కెట్లుండి కూర్చుంటే బాగానే వస్తాయండీ ఫొటోలున్నూ ఇదికూడా ఒక అవాసంగానే వుంటుంది. అప్పు డున్ను కాలం వెళ్ళిపోతుంది. మీదగ్గరవుందా టిక్కెట్టు!" అని అడిగాడు రెండో అతడు. "నేను రైల్వేయుద్యోగస్తుణ్ణి" అని అనేసరికి మూడోస్టేషను వచ్చింది. రైల్వేయుద్యోగి వాని సిస్టర్, వాని నీస్ అంతా దిగిపోయారు. 'సిష్టర్' వెనకపిక్క ఒకింత కనపడేలా చీర ఎగ్గట్టి కట్టింది. 'నీస్' డ్యాన్సుచేస్తూ దిగింది. రైల్వేయుద్యోగి బుసుకోటు సవరించుకుంటూ దిగాడు.

ఇతగాడు వాళ్ళ వెనుకతట్టుకూడా ఒక ఫొటోతీసుకొని ఒక 'బెర్తు' తానంతా ఆక్రమించుకుని రెండో "బెర్తుమీద కెమేరా పడేసి" అంతా ఖాళీయే, అంతా అవాసమేనన్నట్టు తన ఫొటోలకట్ట తిలకించేడు. రైలుబండి నడుస్తూనేవుంది ఇంకా నడుస్తూనే వుంది. జీవితంయొక్క పరమావధి ఎక్కడి కక్కడికే జరగడం అనిపించింది......

... ... ... ... ...